క్లుప్తంగా

ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న జయరాజ్

కంచిలి: ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాలు, సర్వేలకు సంబంధించి ఇప్పటి వరకు సాధించిన ప్రగతిపై మండల ప్రత్యేకాధికారి డాక్టర్ జయరాజ్ అధికారులతో సమీక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో హౌసింగ్, ఉల్లాస్, బేస్ లైన్ సర్వే తదితర అంశాలమీద చర్చించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఏపీఎం ఎస్.ప్రసాదరావు, గృహనిర్మాణశాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌పై అవగాహన



మాస్టర్‌ప్లాన్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణ ప్రణాళిక (మున్సిపాలిటి మాస్టర్‌ప్లాన్)పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని కౌన్సిల్‌హాల్లో కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లకు టౌన్‌ప్లానింగ్ అధికారి వినయ్ ప్రసాద్ మాస్టర్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం పట్టణ బృహత్తర ప్రణాళిక విభాగం గురించి పూర్తిగా వివరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పి.మధుమూర్తి, బి.జగన్నాథం, టి.ఆదిరెడ్డి, ప్లానింగ్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ప్రతినిధులు

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం చేతివృత్తిదారుల కోసం నిర్వహిస్తున్న విశ్వకర్మ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ కేంద్రం ప్రతినిధి ఆనందరావు అన్నారు. టెక్కలి పాలకేంద్రం రోడ్‌లో శిక్షణ కేంద్రంలో మొదటి విడతగా నైపుణ్య శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఆనందరావు మాట్లాడుతూ.. ప్రస్తుతానికి నియోజకవర్గం పరిధిలో 4 మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణులకు మొదటి విడతగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు డొంకూరు విద్యార్థిని

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.యోగేశ్వరి రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు జె.సరోజిని తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు యోగేశ్వరిని అభినందించారు. ఈనెల 25, 26 తేదీల్లో కర్నూలు జిల్లా డీఎస్‌ఏ స్టేడియం వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ హై జంప్ పోటీల్లో జిల్లా తరఫున యోగేశ్వరి పాల్గొంటున్నట్లు తెలిపారు. కోచ్ వజీర్ అహ్మద్‌ను కూడా అభినందించారు.

నష్టపరిహారం పంపిణీ

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన బెందాళం కవిత విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసేవారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కుటుంబానికి విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంక్షేమ పథకం కింద రూ. లక్ష నష్టపరిహారాన్ని బోర్డు డైరెక్టర్ ఆరంగి రమణబాబు మంగళవారం అందజేశారు. మేనేజర్ శ్రీరామమూర్తి, సూపర్‌వైజర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

నందిగాం: కవిటిఅగ్రహారం-పూండి రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవిటి అగ్రహారం గ్రామానికి చెందిన బొమ్మాళి తిరుపతిరావు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై పూండి వెళ్తుండగా బెండిగేటు వైపు వస్తున్న ఆటో తిరుపతిరావుకు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన తిరుపతిరావును టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమచికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేస్తోంది

టెక్కలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి కోరారు. మంగళవారం టెక్కలిలో సమావేశం నిర్వహించారు. టెక్కలి, నందిగాం మండలాల పరిధిలో ప్రతీ ఉపాధ్యాయుడిని ఓటరుగా చేర్చే విధంగా కార్యక్రమాలు చేయాలన్నారు. ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి గెలిపించే విధంగా కృషి చేయాలని శ్రీరామ్మూర్తి కోరారు. ప్రతినిధులు కె.దాలయ్య, పి.గణపతిరావు, బి.శంకర్రావు, టి.వైకుంఠరావు ఉన్నారు.

మొక్కుబడిగా పొలం పిలుస్తోంది!

- హాజరు కాని అనుబంధ శాఖల అధికారులు
- వ్యవసాయాధికారులతోనే కార్యక్రమం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



అనుబంధ శాఖాధికారులు లేకుండా కొరాడీ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: రైతుల పక్షపాతిగా చెప్పుకుంటూ కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటాలతో నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఆదిలోనే తుస్సుమంటోంది. ఫ్లెక్సీలతో ప్రచారమే తప్పా క్షేత్ర స్థాయిలో రైతులకు ఉపయోగం లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమానికి వ్యవసాయాధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజరవుతుండటంతో కార్యక్రమం అభాసుపాలవుతోంది. పంటల సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా మంగళ, బుధ వారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఉదయం, సాయంత్రం వ్యవసాయాధికారులతో పాటు వాటి అనుబంధ శాఖల అధికారులు సైతం పొలంబాట పట్టి రైతులకు అవగాహన కల్పించాలి. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలసి సాగు కష్టాలు తెలుసుకొని నూతన పద్ధతులపై అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల్లో వరితో పాటు కొబ్బరి పంట, పాడి సంపద, తీరప్రాంత మత్స్యకార రైతులు ఉన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయాధికారులతో పాటు ఉద్యానవన, ఆత్మ, సెరికల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం వంటి పదికి పైగా శాఖాలకు సంబంధించి అధికారులు హాజరు కావాలి. కానీ ఎక్కడో ఒకచోట ఒక్కో శాఖాధికారి హాజరై మమ అనిపిస్తున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.



బిర్లంగిలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరు కాని అనుబంధ శాఖల అధికారులు

ఫొటోలకే పరిమితం



అన్ని వ్యవసాయ అనుబంధ శాఖాధికారులతో నిర్వహించాల్సిన పొలం పిలుస్తోంది కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ఉద్యానవన, పశు సంవర్ధక, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన అధికారులు కార్యక్రమానికి హాజరై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం ఎక్కడా ఆ స్థాయి కార్యక్రమాలు లేవు. వ్యవసాయ సిబ్బంది ఇద్దరు, ముగ్గురు రైతులను పంట పొలాల్లోకి తీసుకువెళ్లి వెళ్లి ఫొటోలు తీసుకుంటూ కార్యక్రమాన్ని ముగించేస్తున్నారు. దీనివల్ల ప్రయోజనం శూన్యం

– దక్కత నూకయ్యరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, ఇచ్ఛాపురం మండలం

అశోకుని సాక్షిగా ప్రొటోకాల్ ఉల్లంఘన!

ఇచ్ఛాపురం రూరల్: మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బెందాళం అశోక్ సాక్షిగా ప్రజా క్షేత్రంలో గెలిచిన ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్‌తో అవమానం జరిగింది. పల్లె పండుగ పేరుతో సోమవారం లొద్దపుట్టిలో ఎమ్మెల్యే అశోక్ రూ.35 లక్షలు అంచనా విలువతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు పేర్లు లేకుండానే ఆవిష్కరించారు. ఎటువంటి ప్రొటోకాల్ లేనటువంటి టీడీపీ కార్యకర్తల పేర్లు ఉండటంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిమి కావడంతో అవమాన పరచాలనే దురుద్దేశంతో ఈ చర్యలకు పాల్పడ్డారని మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



టీడీపీ కార్యకర్తల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకం

నాయకుల పరామర్శ



పరామర్శలో రెడ్డి శాంతి తదితరులు

సోంపేట: సోంపేటకు చెందిన సీనియర్ న్యాయవాది వడిశ బాలక్రిష్ణ సోదరి శాంతమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో మృతురాలు సోదరుడు బాలక్రిష్ణ, మిగతా కుటుంబసభ్యులను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం సాయంత్రం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శలో ఎంపీపీ నిమ్మన దాసు, సోంపేట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బతకల మోహనరావు, న్యాయవాది సిలగాన భాస్కరరావు, గుర్రాల శ్రీను తదితరులున్నారు.



బన్నువాడలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఫాల్గుణ రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: మండలంలో పలువురిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. టీడీపీ కార్యకర్తల చేతిలో గాయపడిన వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త కూన కూర్మారావు, బన్నువాడ గ్రామంలో అనారోగ్యానికి గురైన ఎంపీటీసీ సభ్యుడు పోలాకి ఫాల్గుణరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోలాకి సోమేశ్వర్రావు, ఇటీవల చనిపోయిన లైన్‌మెన్ కూన సింహాచలం కుటుంబాన్ని దువ్వాడ పరామర్శించారు. నాయకులు యు.విశ్వనాథం, శిగిలిపల్లి మోహన్‌రావు, పి.శివ ఉన్నారు.



కూర్మారావును పరామర్శిస్తున్న తిలక్, నాయకులు

టెక్కలి: ఇటీవల టీడీపీ కార్యకర్తల చేతిలో గాయపడిన టెక్కలి మండలం సీతాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూన కూర్మారావును పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం పరామర్శించారు. కూర్మారావు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలపై కక్ష సాధింపు చర్యలు పాల్పడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి సంస్కృతి మంచిది కాదన్నారు. టీడీపీ కార్యకర్తల చేతిలో గాయపడిన కూర్మారావుకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్తారు సత్యం, నాయకులు బెండి ఉదయ్, ఎస్.శంకర్, చిన్ని జోగారావు ఉన్నారు.

పుస్తెలతాడు చోరీపై ఫిర్యాదు

టెక్కలి రూరల్: తన బంగారు పుస్తెలతాడు చోరీకి గురైందని స్థానిక శ్రీనివాసనగర్‌కు చెందిన తాసుమాను లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు టెక్కలి పోలీసులు మంగళవారం తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మాధవ్ భార్య లక్ష్మితో శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్నారు. సోమవారం సాయంత్రం గుర్తు తెలియని యువకుడు తన ఇంటి వద్దకు వచ్చి కళాశాల చిరునామా అడిగిన తరువాత తాగేందుకు మంచినీరు కావాలని అడిగినట్లు పేర్కొన్నారు. తెచ్చేందు ఇంటిలోకి వెళ్తుండగా దాడిచేసి మెడలోని సుమారు నాలుగు తులాల పుస్తెలతాడును తెంచుకుని పారిపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



వజ్రపుకొత్తూరు: పీఎంపురంలో శిలాఫలకాలన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: ఉపాధి హామీ పథకం నిధులతో వజ్రపుకొత్తూరు మండలానికి మంజూరు చేసిన సీసీ రహదారుల నిర్మాణాలను వేగవంతం చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మహదేవిపురం, బట్టునాడు, పీఎంపురం గ్రామాల్లో రూ.55.5 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. జనసేన నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ దుర్గారావు, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మాజీ ఎంపీపీ జి.వసంతరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.మోహనరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు..

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు, చినవంక, అక్కుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు వి.దుర్గారావు, దువ్వాడ హేమబాబు చౌదరి, సూరాడ మోహన్ రావు, దుర్యోధన ఉన్నారు.

క్లోరినేషన్ తప్పనిసరి

- ఏడీఎంహెచ్‌వో శ్రీకాంత్

సంతబొమ్మాళి: మంచినీటి సరఫరా చేసే వాటర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, క్లోరినేషన్ విధిగా చేపట్టిన తరువాతే నీటి నాణ్యత తెలుసుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీకాంత్ అన్నారు. శివరాంపురం గ్రామంలో ఎంపీడీవో జయంతి ప్రసాద్‌తో కలిసి వాటర్ హెడ్ ట్యాంక్ వద్ద సరఫరా అవుతున్న మంచినీటి నాణ్యతను ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా మంగళవారం తెలుసు కున్నారు. నీటిలో క్లోరినేషన్ శాతం మోతాదుకు అనుగుణంగా ఉండాలన్నారు. డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంలో పని చేయాలని సూచించారు. డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్, ఈవో శ్రీనివాసరావు ఉన్నారు.



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

భూసర్వేలో తప్పులను సరిచేసుకోండి



కంచిలి: అంపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



ఇచ్ఛాపురం రూరల్: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

కంచిలి: మండలంలో ఇది వరకు సర్వే జరిగిన 35 రెవెన్యూ గ్రామాల్లో ఎటువంటి తప్పులు ప్రింట్ అయివున్నా గ్రామసభల్లో దరఖాస్తు ద్వారా విన్నవించుకోవాలని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో మంగళవారం నుంచి ప్రారంభమైన గ్రామసభల్లో మొదటి రోజున అంపురం, పద్మతుల గ్రామాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంపురంలో 10, పద్మతుల గ్రామంలో మూడు భూ సమస్యలపై వినతులు వచ్చాయని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ వెల్లడించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, స్థానిక నేతలు మద్ది అప్పారావు, ఉప సర్పంచ్ కేశవరావు, డిప్యూటీ తహశీల్దార్ డి.సంతోష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఎస్.వెంకటరావు అన్నారు. ముచ్చింద్ర, కేధారిపురం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించారు. గతంలో రీ-సర్వే అనంతరం ఏమైన తప్పులు దొర్లుంటే వాటిని సరిచేయడానికే ప్రభుత్వం ఈ సదస్సులను నిర్వహిస్తుందని అన్నారు.ముచ్చింద్రలో 25, కేధారిపురంలో 18 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ప్రజలను భయాందోళనకు గురిచేస్తారా?

- వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి



వజ్రపుకొత్తూరు: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పల్లె పండుగ పేరుతో గ్రామాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదని వజ్రపుకొత్తూరు వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి అన్నారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడానికేనా మీకు ఓట్లు వేసింది అని ప్రశ్నించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పలాస నియోజకవర్గంలో జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక దాడులను గాలికొదిలేసి పల్లె పండుగ పేరుతో మంగళవారం బెండి పంచాయతీ మహదేవిపురం వచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులను రోజూ ఊచలు లెక్కపెట్టిస్తానని బెదిరింపులకు దిగడం బాధాకరమన్నారు. మహదేవిపురం, బట్టుపాడు గ్రామాల్లో సీసీ రహదారులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాపై పేర్ల విషయంలో ప్రోటోకాల్ పాటించకపోవడం తగదన్నారు. వైస్ ఎంపీపీకి ప్రోటోకాల్ ప్రకారం గౌరవ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తాము అభివృద్ధికి అడ్డుకాదని.. పంచాయతీ నుంచి తీర్మానాలు సైతం ఇచ్చామని అన్నారు. టీడీపీ పాలనలో బెండి పంచాయతీకి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని మీరు అభివృద్ధి గురించి మాట్లాడడం సరికాదన్నారు.

స్తంభాన్ని సరిచేయరూ..

టెక్కలి మండలం పెద్దరోకళ్లపల్లి గ్రామం సమీపంలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. సీతారాంపల్లి, రామనగరం గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఈ మార్గంలో స్తంభం ఒరిగిపోవడంతో వర్షాలు పడే సమయంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు. – టెక్కలి



ఒరిగిపోయిన స్తంభం

అధ్వానం

సోంపేట మండలం పలాసపురం పంచాయతీ లక్కవరం రహదారి అధ్వానంగా మారింది. శాశ్వత రహదారి నిర్మాణం కాక పోవడంతో ఈ ప్రాంతీయులు ఇబ్బంది పడుతున్నారు. వాహన ప్రమాదాలు జరగడంతోపాటు చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మాణం చేసి కష్టాలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. -సోంపేట



అధ్వానంగా ఉన్న లక్కవరం రహదారి

మురుగుతో అవస్థలు..

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి సోగ్గాడిపేట వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీటితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై పారుతూ దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. పంచాయతీ యంత్రాంగం స్పందించి మురుగు నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - టెక్కలి



టెక్కలి సోగ్గాడిపేట వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

నేలపైనే భోజనాలు..

ఇచ్ఛాపురం మండలం బి.తోటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 113 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు-నేడు పనులు సగంలో నిలిచిపోవడంతో ఎనిమిది తరగతులకు కేవలం మూడు గదుల్లోనే విద్యా బోధన సాగుతోంది. మధ్యాహ్న భోజనం సమయంలో మండుటెండల్లో నేలపైనే కూర్చొని భోజనాలు చేయాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఇచ్ఛాపురం రూరల్



నేలపై భోజనాలు చేస్తున్న బి.తోటూరు విద్యార్థులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బలపరచండి



అమలపాడు పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో రఘువర్మ

వజ్రపుకొత్తూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను రెండో సారి గెలిపించేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ఉపాధ్యాయులను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని హుకుంపేట, అమలపాడు, పెద్దమురహరిపురం, దేవునల్తాడ, గోవిందపురం, పాతటెక్కలి పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ కమిషన్ వేయాలని, డీఏ బకాయిలను చెల్లించాలని, 117 జీఓ రద్దు చేసి పాఠశాలలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కార్యకర్తలు వెంకటరావు, ఆనందబెహరా, పి.కిషోర్, మెట్ట మోహనరావు, ఎస్.షణ్ముఖరావు, బి.హేమశంకర్, టి.లింగరాజు ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానం

సోంపేట: బేసిరామచంద్రపురం గ్రామానికి చెందిన చిచ్చుల రఘునాథ్ స్మారకార్థం కుమారుడు, హాంగ్ కాంగ్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కాశేశ్వరరావు సౌజన్యంతో ఏటా మాదిరిగానే గ్రామంలో ప్రతిభ కనబరిచిన పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను మంగళవారం ప్రదానం చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 2024-25 విద్యాసంవత్సరంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థినులకు ఏడాదికి రూ. 5 వేలు చొప్పున ఆరు సంవత్సరాలపాటు ఇస్తామని ప్రకటించిన ప్రకారం వారికి నగదు బహుమతిని అందజేశారు. అలాగే నుంచి డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై త్వరలో శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్న శాసనపురి శైలజకు ప్రోత్సాహంగా రూ. మూడు వేలు అందించారు. వైఎస్సార్‌సీపీ నేత బుద్దాన శ్రీక్రిష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ వడ్డి సతీష్, గ్రామపెద్దలు సుబుద్ధి వెంకటరావు, చిచ్చుల జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

తుఫాన్ హెచ్చరికతో.. పునరావాస కేంద్రాలు ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడుతుందన్న హెచ్చరికతో అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో అన్ని శాఖాధికారులతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా డొంకూరు మత్స్యకార గ్రామంలో దండోరా వేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఐదు రోజుల పాటు ఏ ఒక్క అధికారి, సిబ్బంది సెలవులు పెట్టకుండా ఉండాలని అన్నారు. ముందస్తు జాగ్రత్తగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అత్యవసర సమయంలో 91141 15363 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కోటబొమ్మాళి: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, 27 సచివాలయాల సిబ్బందితో సమీక్ష చేశారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

కోర్టు భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టండి

టెక్కలి: టెక్కలిలో నూతన కోర్టు సముదాయం భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వి.వివేకానంద, ఎస్.దివాకర్ కోరారు. విజయవాడలో ఆర్‌అండ్‌బీ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోర్టు భవనాల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా దృష్టి సారించాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.



మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు